క్లుప్తంగా

కార్పెంటర్ అసోసియేషన్‌కు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ రేణుక తదితరులు

చిత్తూరు రూరల్: కార్పెంటర్ అసోసియేషన్‌కు చిత్తూరు నగర పరిధిలోని బండపల్లె ప్రాంతంలో శనివారం జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ రేణుక, తహసీల్దార్ కిరణ్, సర్వే బృందంతో కలిసి స్థల పరిశీలన చేశారు. అసోసియేషన్‌కు 5 ఎకరాల భూమి కోసం ఈ పరిశీలన చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలూరు సచివాలయం తనిఖీ



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పాలూరు సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. వివిధ దరఖాస్తులను పెండింగ్ లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీమా రెన్యూవల్‌ను శనివారం సాయంత్రంలోపు పూర్తి చేయాలన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఏపీఆర్‌జేసీ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రతిభ ఎడ్యుకేషనల్ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపల్ యోగానంద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. నగరంలోని మిట్టూరులో ఉన్న తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన కిరణ్ (ఎంపీసీ) 73 మార్కులు, బైపీసీ విభాగంలో భానుతేజ 74, నిఖిల్ ప్రసాద్ 66 మార్కులు సాధించి ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో సీట్లు సాధించారని ఆయన చెప్పారు.

దివిటివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు ఇచ్చారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వినాయకుని సేవలో కర్ణాటక మంత్రి



చిత్రపటం ఇస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక రాష్ట్ర మంత్రి మునియప్ప శుక్రవారం రాత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఏఈఓ అందజేశారు.

హోరుగాలి.. వర్షం



నగరి: మున్సిపల్ పరిధిలో శుక్రవారం సాయంత్రం హోరుగాలితో వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దీంతో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయి సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది. విరిగిన చెట్లను తొలగించి పరిస్థితి యథాస్థితికి తేవడానికి ట్రాన్స్‌కో, మున్సిపల్ సిబ్బంది శ్రమపడాల్సి వచ్చింది.

సచివాలయం.. సేవలన్నీ సాకారం



■ ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు హారతి. ఈమెది చిత్తూరు మండలం బీఎస్ఆర్‌పేట గ్రామం. కుటుంబంలో మొత్తం నలుగురు ఉన్నారు. వివాహమై 18 ఏళ్లు అయినా రేషన్ కార్డు పొందడానికి గత ప్రభుత్వ పాలనలో చేయని ప్రయత్నమంటూ లేదు. అయినా మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ సలహాతో రెండేళ్ల క్రితం సచివాలయంలో రేషన్ కార్డుకు ఆమె దరఖాస్తు చేశారు. రెండు రోజుల్లో వలంటీర్ ద్వారా కార్డు ఇంటికి చేర్చారు. ఇప్పుడు క్రమం తప్పకుండా రేషన్ పొందుతోంది.



■ ఈమె కూడా చిత్తూరు మండలం బీఎస్ఆర్‌పేట వాసినే. పేరు నళిని. రేషన్ కార్డు కోసం గత టీడీపీ పాలనలో పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. కానీ కార్డు మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ద్వారా ఇంటి నుంచే సచివాలయానికి దరఖాస్తు చేశారు. రెండురోజుల్లో రెండు సార్లు ఈకేవైసీ చేయించి రేషన్ కార్డు ఇచ్చారు. ఆమె ఆనందానికి అంతులేకుండా పోయింది.



పాలూరు సచివాలయం

- గ్రామీణులకు అందుబాటులో సచివాలయాలు
- వలంటీర్లతో గడప వద్దకే ప్రభుత్వ సేవలు
- ప్రజలకు తప్పిన ప్రదక్షిణలు

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ సేవలను ప్రజల దరికి చేర్చడంలో సచివాలయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇందులో వలంటీర్ల తమవంతు క్రియాశీలక పాత్రతో సచివాలయ వ్యవస్థ సేవలు ప్రజలకు త్వరితగతిన అందుతున్నాయి. గత టీడీపీ పాలనలోలా రోజులు మొదలు వారాలు, నెలల తరబడీ ప్రదక్షిణలు చేసే అగత్యం తప్పిందని ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో 9 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 86 మంది సచివాలయ ఉద్యోగులు, 141 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. పల్లె ప్రజలకు సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ సేవలు వారి ముంగిటకే వెళ్లేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సేవలను విస్తృతం చేసింది. దీంతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. సచివాలయం ద్వారా మొత్తం 536 సేవలను ప్రభుత్వం అందిస్తోంది.

సచివాలయ సేవలు సులభతరం

సచివాలయాల్లో ప్రధానంగా ఇంటి పట్టా, రేషన్‌కార్డు, మ్యుటేషన్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్-బీ, అడంగల్, పింఛన్ దరఖాస్తు, సదరన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, కరెంటు తదితర

మండలంలో సచివాలయాలు అందించిన సేవలు

మొత్తం సచివాలయాల సంఖ్య	:	9
సిబ్బంది	:	86
వలంటీర్లు	:	141
నాలుగేళ్లలో మంజూరు చేసిన		
రేషన్ కార్డులు	:	772
ఇంటి స్థలాలు	:	1356
మ్యుటేషన్ దరఖాస్తులు	:	235
సదరన్ దరఖాస్తులు	:	159
రేషన్ కార్డులు	:	3894
ఆధార్ సేవలు	:	2621
కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	:	28,500
		(సుమారు)

సేవలు ఎక్కువగా జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లు. అది కూడా రెండేళ్లకోసారి కార్డులు ఇచ్చేవారు. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్కరోజులోనే వందలాది మందికి కార్డులు ఇచ్చారు. సచివాలయాల పనివేళల్లో పలువురు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తున్నారు. అర్హత ఉంటే నిర్ణీత సమయంలో వలంటీర్ల ద్వారా కార్డులు ఇంటికి చేరుస్తున్నారు. ఇదే కోవలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నారు. గతంలో కుల, ఆదాయ ధృవీకరణ పత్రానికి కూడా చిత్తూరు నగరానికి వెళ్లేవారు. వీఆర్‌ఓ, ఆర్‌ఐ, తహసీల్దార్ సంతకాల కోసం ప్రదక్షిణలు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కష్టాలకు చెక్ పెట్టింది. వలంటీర్ చేత దరఖాస్తు ఫారం ఇస్తే చాలు 7రోజుల్లో ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. సచివాలయాల్లోనే మ్యుటేషన్ చేసే అవకాశం కల్పించారు. పింఛన్ కూడా నిర్ణీత గడువులోపు మంజూరయ్యేలా ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీంతో కార్యాలయాల్లో ప్రజలకు క్యూ కట్టాల్సిన అవసరం తప్పింది.



పాలూరు సచివాలయంలో సేవల కోసం సిబ్బంది ఎదుట ఉన్న ప్రజలు



బీఎస్ఆర్‌పేట సచివాలయంలో ఆధార్ చేస్తున్న సిబ్బంది

ఆధార్ ఇప్పుడు మా ఊళ్లోనే..



ఆధార్‌లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు, కొత్తగా తీసుకోవడానికి చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ఇచ్చే టోకెన్‌తో 10 రోజుల తర్వాత ఆధార్ చేయించుకున్న సందర్భం ఉంది. ప్రభుత్వం సచివాలయంలోనే ఆధార్ కేంద్రాని ఏర్పాటు చేసింది. ఇక్కడ ఆధార్ సెంటర్ పెట్టడం ఇంటి పని..వంట పని చేసుకుని ఆధార్ తీయించుకున్నాం. సచివాలయం వచ్చాక ఎంతో మేలైంది. చిత్తూరుకు వెళ్లే పని తప్పింది.

-అజీదా భాను, బీఎస్ఆర్‌పేట

చిత్తూరుపోయే పనిలేదు



ముందు ఏ పని అయినా చిత్తూరుకు వెళ్లేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం మా ఊరి దగ్గర్లనే సచివాలయం కట్టింది. అన్ని సేవలూ అక్కడే అందుతున్నాయి. ఇంతకుముందు వన్-బీ కావాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా కష్టం తప్పింది. సచివాలయంలో పది నిమిషాల్లోనే వన్-బీ ఇచ్చేస్తున్నారు. వలంటీర్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.

- శ్రీరాములునాయుడు, 5 వెంకటాపురం

అర్హతే ప్రామాణికంగా పథకాలు



పాలమాకులపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలివారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని గౌరీపురం, పాలమాకులపల్లె, ఇంద్రానగర్, బలిజపల్లె గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేశారు. రేషన్‌కార్డులు, పక్కా గృహాలు, పింఛన్లు మంజూరు కాలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై అర్హత కలిగిన వారికి పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పాలమాకులపల్లె, ఇంద్రానగర్‌లో గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు. సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, గ్రామంలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పథకాలను పారదర్శకంగా అందేలా పనిచేయాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు, శరత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ప్రభునాయుడు, కృష్ణమూర్తి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ మహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మునీంద్ర, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, యూత్ అధ్యక్షుడు జగదీష్, ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మలాథిన్ పిచికారీ చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరమవుతాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి పీరూసాహెబ్ అన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తగ్గువారిపల్లెలో ప్రజలకు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాలువలు, గృహాల వద్ద మలాథిన్ పిచికారీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం పీరూసాహెబ్ మాట్లాడుతూ, నివాస గృహాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందవన్నారు. దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే తప్పక పాటించాలని సూచించారు. తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్, ఎంపీహెచ్‌ఈఓ బృహస్పతి, డీపీఎంఓ మణి, ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్కూళ్లకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్లు



ఆటోలో చేరవేస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు

గుడిపాల: గుడిపాల మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ రామ్‌నాయక్ తెలిపారు. నరహరిపేట హైస్కూల్ నుంచి ఆటోలలో ఆయా స్కూళ్లకు వీటిని చేరవేసినట్లు చెప్పారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,593 మందికి విద్యార్థులకు వీటిని పాఠశాలల పునఃప్రారంభం రోజునే ఇస్తామన్నారు.

జేపీ నడ్డా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సోము వీర్రాజు, బీజేపీ ఎంపీ, పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా శనివారం పట్టణంలోని భేరివారి మండపం వద్ద భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత తొమ్మిదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అందించిన సుపరిపాలన గురించి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సభావేదికగా వివరిస్తారన్నారు. రాష్ట్రం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరివిగా నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. రైల్వే, రహదారుల, విద్య, వైద్యం ఆర్థిక వ్యవస్థ తదితర రంగాల్లో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో ప్రజల వద్దకు తీసుకెళతామన్నారు. జేపీ నడ్డా సాయంత్రం 5 గంటలకు సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రులు అమిత్ షా, మురళీధరన్ కూడా రాష్ట్రంలో పర్యటించనున్నట్లు చెప్పారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, నాయకులు కోలా ఆనంద్, మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, చంద్రప్ప, గరికపాటి రమేష్‌బాబు, గోపాల్, వెంకటేశ్వర్లు, కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీకుమార్, వెంకటేష్ ఆచారి పాల్గొన్నారు.

మహిళల భద్రతకు భరోసా



యాదమరి :పెరుమాళ్లపల్లెలో గడప గడపకు సర్వేలో ఎస్‌ఐ, మహిళా పోలీసులు

బంగారుపాళెం: మహిళల భద్రతకు భరోసా కల్పించడమే 'ప్రతి గడపకు మహిళా పోలీస్' అని సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సీఐ, జీఎంఎస్‌కేలు ప్రతి గడపకూ వెళ్లి కుటుంబ వివరాలను యాప్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గడపకు మహిళా పోలీస్ యాప్‌కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. సర్వేలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి మహిళా పోలీసులు ప్రేమగా మాట్లాడినప్పుడు సమస్యలను నిర్భయంగా చెబుతారన్నారు. తద్వారా తగు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, జీఎంఎస్‌కేలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వెళ్లాలి

యాదమరి: గ్రామాల్లో ప్రతి గడపకు మహిళ పోలీసు వెళ్లాలని, సమస్యలు ఎవైనా ఉంటే తెలుసుకోవాలని ఎస్‌ఐ సుమన్ సూచించారు. ప్రతి గడపకు మహిళ పోలీసు కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. మొదట యాదమరి సచివాలయంలో మహిళ పోలీసుకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం పెరుమాళ్లపల్లె గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యలు వస్తే ఎలా ఫిర్యాదు చేయాలనే అంశాలను వివరించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో శుక్రవారం ప్రతి గడపకు మహిళా పోలీస్ కార్యక్రమాన్ని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి దిశాయాప్, పోక్సో చట్టంతో పాటు పలు అంశాలపై సర్వే చేసి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: ప్రతి గడపకూ మహిళా పోలీస్ వచ్చి మహిళల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్దేశమని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వసంతాపురం సచివాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వసంతాపురం పంచాయతీలో మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి దిశ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలపై మహిళలను ఆరా తీశారు.కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, ఏఎస్‌ఐ మునివేలు, కానిస్టేబుల్ జ్యోతిష్‌కుమార్ పాల్గొన్నారు.



బంగారుపాళెం సర్వే కార్యక్రమంలో సీఐ నరసింహారెడ్డి



తవణంపల్లె : సర్వేలో పాల్గొన్న ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి



గుడిపాల: వసంతాపురంలో..

శరవేగంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు



సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎంఆర్ పల్లి కూడలి- మహిళా యూనివర్సిటీ రోడ్డును కలుపుతూ సీతమ్మనగర్ మీదుగా అభివృద్ధి చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న ఎలక్ట్రికల్ ప్యాకేజ్ సబ్‌స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించడంపై ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర విస్తరణ, నగరానికి కనెక్టివిటీ పెంచడం, ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ఇప్పటికే 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటికే ఆరింటిని ప్రజలకు అంకితం చేశామన్నారు. మరో 10 రోడ్లు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ఎస్వీయూనివర్సిటీ రోడ్డు- జూపార్క్ రోడ్డును కలుపుతూ మరో 3 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎంఆర్ పల్లి నుంచి మహిళా యూనివర్సిటీ రోడ్డుకు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో సుదూరంగా ప్రయాణించాల్సి ఉందని, సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డుతో రెండు మూడు నిముషాల్లోనే చేరుకోవచ్చన్నారు. ఈ రోడ్డుకు మరిన్ని లింక్ రోడ్లు కలుస్తుండడంతో ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఎస్పీడీసీఎల్ డీఈ వాసుదేవ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మాకం చంద్ర, బ్రహ్మానందరెడ్డి, వెంకటమునిరెడ్డి, పడమటి కుమార్, వీర అనిల్, సోమశేఖర్ రెడ్డి, డిష్ చంద్ర, రమేష్ రెడ్డి, తిమ్మారెడ్డి, సద్దాబాబు యాదవ్, బాలకృష్ణ యాదవ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం సురక్షితం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పాలసముద్రం: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పు సురక్షితమని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. శుక్రవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 37 మందికి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం సమయంలో 108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.